క్లుప్తంగా

'మున్సిపాలిటీగా మార్చండి'

ఆత్మకూరు : ఆత్మకూరు మండలాన్ని మున్సిపాలిటీగా మార్చాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీకి అనుగుణమైన జనాభా కలిగిన ఆత్మకూరును మున్సిపాలిటీగా మార్చాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి చొరవ చూపాలన్నారు. మున్సిపాలిటీ చేయడం వల్ల అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు.

6 నుంచి వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రదర్శన

పరకాల : రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 6 నుంచి గ్రామాల్లో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని పరకాల మండల సహాయ ఎన్నికల అధికారి, ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు మంగళవారం ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీవరకు పంచాయతీ కార్యదర్శి ద్వారా ఆర్డీఓకు అందజేయాలని కోరారు. 19వ తేదీలోపు వాటి సవరణల పరిశీలన అనంతరం 21వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా ఓటర్ల జాబితాపై ఈ నెల 10న మండల పరిధిలోని ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఆంజనేయులు పేర్కొన్నారు.

కంటి వైద్యశిబిరం



పరకాల : ఎల్ఐసీ వారోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పరకాల ఎల్ఐసీ కార్యాలయంలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సదాశయ ఫౌండేషన్ పరకాల కన్వీనర్ గుంటోజు వెంకన్న హాజరై మాట్లాడారు. మరణించిన తర్వాత ఉపయోగపడే నేత్ర, అవయవ, శరీరాలను మట్టిలో వృథా కాకుండా లక్షలాది మంది ప్రాణపాయస్థితిలో అవయవాల దానం కోసం ఎదురు చూస్తున్న విషయాన్ని గ్రహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవయవ దానంపై అవగాహన కల్పించారు. అవయవ, శరీర దాన సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి, జనవిజ్ఞాన వేదిక హనుమకొండ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, పరకాల ఎల్ఐసీ అధికారులు రవీందర్, సాంబయ్య, భాస్కర్‌రెడ్డి, వాసవి కేర్ ఆస్పత్రి ఇన్‌చార్జ్ అరుణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేసుకోవాలి

దామెర : విద్యుత్ మీటర్లు లేని వినియోగదారులు వెంటనే మీటర్లు అమర్చుకోవాలని ఏఈ గుర్రం రమేశ్ మంగళవారం ప్రకటనలో సూచించారు. మీటర్ల కోసం ఆధార్ కార్డు, పాస్‌ఫొటోతో సబ్ స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. కేవలం రూ.938లకు మీటర్ అందించడం జరుగుతుందన్నారు. మీటర్ అమర్చుకొని ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం సబ్ స్టేషన్‌లోని కార్యాలయాన్ని, లేదా ఏఈని సంప్రదించాలని కోరారు.

రేషన్‌షాపుల్లో తనిఖీ



హసన్‌పర్తి : మండలంలోని చింతగట్టు, హసన్‌పర్తి గ్రామాల్లోని రెండు రేషన్ షాపులను విజిలెన్స్ కమిటీ సభ్యులు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్‌షాపుల్లోని రికార్డులను పరిశీలించారు. ప్రతినెలా షాపునకు విడులవుతున్న బియ్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతినెల ఎంత మంది లబ్ధిదారులకు బియ్యం అందిస్తున్నారని అడిగారు. మిల్లర్ల నుంచి ఎఫ్‌సీఐకు ఏ రకమైన బియ్యం సరఫరా చేస్తున్నారు. అవే బియ్యం రేషన్‌షాపులకు చేరుతున్నాయా అని ప్రతి నెల ఎన్ని రోజులు షాపులు తెరిచి ఉంటాయని అడిగి తెలుసుకున్నారు..

మట్టి గణపతినే పూజించాలి

హన్మకొండ: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలని సామాజిక వేత్త, పర్యావరణ ప్రేమికుడు నిమ్మల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పబ్లిక్ స్కూల్‌లో మట్టి వినాయక ప్రతిమలను పూజించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను తాగునీటిలో నిమజ్జనం చేయడం వల్ల అందులో ఉన్న విషపూరిత రంగుల వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, నీరు కలుషితమవుతుందన్నారు. మట్టి ప్రతిమల సమాచారానికై 9949709866 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ గోపు జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



శాయంపేట: నూర్జహాన్‌పల్లిలో మాట్లాడుతున్న సీడీపీఓ స్వాతి



దామెర: ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్, వైద్యసిబ్బంది

● ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి

శాయంపేట : పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి, ఎంపీడీఓ ఫణిచంద్ర అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ మేరకు మండలంలోని నూర్జహాన్‌పల్లి, కొత్తగట్టు సింగారం గ్రామాల్లో మంగళవారం అంగన్‌వాడీ సెంటర్లలో నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు తమ రోజు వారి ఆహారంలో ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం వల్ల మనిషికి అవసరమైన శక్తిని అందించడంలో పోషకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు రోజువారి తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, పండ్లు, సంపూర్ణ పోషకాలు ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. క్యారెట్, బీట్రూట్, గుమ్మడి వల్ల ప్రొటీన్లు, ఫైబర్ ఖనిజాలు అందుతాయన్నారు. పిల్లలు ఎదగడానికి ప్రతి రోజు కోడిగుడ్లు, పాలు, పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు అందించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కీర్తి అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ టీచర్లు అనిత, రేవతి, మధుర, సరిత, కారోబార్ పెంబర్తి రాజు, మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట : కొత్తగట్టు సింగారంలో..



ఆత్మకూరులో..

పోషకాహార లోపం లేకుండా చూడాలి

ఆత్మకూరు : చిన్నారుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని మండల వైద్యాధికారి స్పందన తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్పందన మాట్లాడుతూ మండలంలో 0–59 నెలల పిల్లలకు పోషకాహార లోపం, ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులను గుర్తించి ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : పోషకాహారంతో సంపూర్ణ ఆర్యోగం చేకూరుతుందని మండల వైద్యాధికారి మంజుల తెలిపారు. పోషణ మాసం సందర్భంగా ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ సంయుక్తంగా మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలతో పాటు ఐరన్, విటమిన్లు కలిగిన ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల కారణంగా అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వెల్లడించారు. తగిన జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పోషణలోపం రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సమష్టిగా కృషిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జంగం రాణి, ఉమాదేవి, పీహెచ్ఎన్ నీల, సూపర్‌వైజర్లు పిట్టల శ్రీకాంత్, భాగ్యలక్ష్మి, అశోక్ బాబు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అవమానించిన టీచర్లను సస్పెండ్ చేయాలి

● తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రకాశ్

ఎల్కతుర్తి : ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులను కులం పేరుతో దూషించి, అవమానించిన టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శంషాబాద్ మండలం పాలమాకుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థినులను మీ దగ్గర ఎస్సీ వద్ద వాసన వస్తోందని అవమానించడం, కులంపేరుతో దూషించడం ఎంతవరకు సమంజసమని ఆయన మండిపడ్డారు. స్వతంత్ర దేశంలో ఇప్పటి వరకు దళిత, గిరిజనులకు చదువుకునే స్వేచ్ఛ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించి నాణ్యమైన విద్యా, భోజనం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు భోజనం బాగోలేదని అడిగితే వారిని కొట్టడం, తిట్టడం మానసికంగా వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. తల్లిదండ్రులను వదిలి హాస్టల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యాబుద్ధులు అందించే టీచర్లు కులం పేరుతో మానసికంగా వేధించి మాట్లాడడం బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, టీచర్లను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా మలుపు

మండలంలోని క్యాతంపల్లి శివారులో రోడ్డు కోతకు గురికావడంతో పాటు మలుపుతో ప్రయాణికులు అజాగ్రత్తగా ఉంటే భారీ ప్రమాదం సంభవించే పరిస్థితి ఉంది. క్యాతంపల్లి నుంచి పెద్దపెండ్యాలకు వెళ్లే రోడ్డు గతంలో కురిసిన వర్షానికి అలుగు పడి రోడ్డు ఒక వైపు కోతకు గురై పెద్ద గుంత ఏర్పడింది. ఈ రోడ్డుపై వెళ్లేందుకు రైతులు, ప్రయాణికులు భయపడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. – ధర్మసాగర్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
భార్గవి, పీఆర్ ఏఈ
ఫోన్‌నంబర్ : 95731 15009

చైర్మన్ పదవి స్థానికులకే కేటాయించాలి

ఐనవోలు : మల్లికార్జునస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ పదవిని ఐనవోలు గ్రామానికే కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు ఏర్పాటుకు త్వరలో నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బరిగెల భాస్కర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే ప్రభుత్వ భవనాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. నాయకులు మునిగాల సమ్మయ్య, జన్ను కుమారస్వామి, బొల్లెపల్లి మధు, అడ్డగూడి సతీష్, కొత్తూరి మధుకర్, వెంకన్న, పరమేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆశ వర్కర్లకు రూ.26వేల వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాసు మాధవి

ధర్మసాగర్ : రాష్ట్ర వ్యాప్తంగా విధులు నిర్వర్తిస్తున్న ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం ఆశ కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆశలకు కనీస వేతనం రూ.18 వేలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిందన్నారు. పారితోషికంలో లేని పనులను ఆశ కార్యకర్తలతో చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఆశ వర్కర్లకు ప్రమాద బీమా, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి 4 జతల యూనిఫామ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 5న కలెక్టరేట్లు, జిల్లా వైద్యాధికారులకు వినతి పత్రాలు ఇస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయు జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్, ఎస్.కవిత, ఈడపు రమాదేవి, రాజారపు రజిత, బొక్క రజిత, నక్క సునంద, బైరపాక రాజమణి, వక్కల రజిత, నల్ల సునీత, పిట్టల స్వప్న, కందుకూరి రాణి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న విజయ్‌కుమార్

వేలేరు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పీచర హెల్త్ సబ్ సెంటర్‌ను జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ విజయ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని రికార్డులు, సిబ్బంది హాజరు పట్టిక, మందులు, ఆస్పత్రిలోని వివిధ గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేసే విధంగా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ రాజశేఖర్, పల్లె దవాఖాన డాక్టర్లు వైశాలి, నవీన్ కుమార్, సీహెచ్ఓ మాధవ్, హెచ్ఈఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

● నాలుగు రోజులుగా భగీరథ తాగునీటి సరఫరా బంద్

శాయంపేట : మండల కేంద్రంలో నల్లాల ద్వారా సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ తాగునీరు నాలుగు రోజులుగా నిలిచిపోయింది. భగీరథ పంప్‌హౌజ్ వద్ద విద్యుత్ సమస్య తలెత్తడంతో గ్రామాలకు తాగునీరు సరఫరా కావడం లేదు. శాయంపేటలో ఆరెపల్లి నుంచి బోరు మోటార్ ద్వారా వాటర్ ట్యాంక్‌కు నీటి సరఫరా లేకపోవడంతో అక్కడ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తుతోంది. కాగా మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ వాటర్ ట్యాంకర్ ద్వారా మల్టీపర్పస్ సిబ్బంది పర్యవేక్షణలో ఇంటింటికి తాగునీటిని సరఫరా చేయించారు.



ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్న సిబ్బంది

పద్మశాలీల సంక్షేమానికి పాటుపడాలి



శాయంపేట : పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన వల్లకటి రాజ్‌కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లోని టీఆర్పీఎస్ భవనంలో మాజీ ఎంపీపీ, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. పద్మశాలీల సంక్షేమానికి పాటుపడాలని, చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇందుకు రాజ్‌కుమార్ సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. నాయకులు గోషికే యాదగిరి, రమేశ్, వేముల బాలరాజు, అప్పం శ్రీనివాస్, నవీన్, రాజు, శ్రీనివాస్, హరి పాల్గొన్నారు.

పత్తి, మొక్కజొన్నకు తీవ్ర నష్టం



నేలవాలిన మొక్కజొన్నను చూపుతున్న అనిల్

ఐనవోలు : ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెరుమాండ్లగూడెం, పంథిని, కక్కిరాలపల్లి, నందనం, రెడ్డిపాలెం, ఒంటిమామిడిపల్లి, వెంకటాపూర్, గర్మిళ్లపల్లి, కొండపర్తి, వనమాల కనపర్తి తదితర గ్రామాల్లో సుమారు 1,000 ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న పంటలు నేలవాలినట్లు ప్రాథమిక సమాచారం. అయితే ఇప్పటి వరకు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించకపోవడం విడ్డూరంగా ఉందని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు కేవలం మండల కేంద్రాలకే పరిమితం కాకుండా పొలాల్లో తిరిగి నష్టపోయిన రైతులు, పంట విస్తీర్ణం వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

దామేశ్వరాలయ అభివృద్ధికి సహకరించాలి



సీసీ కెమెరాలు బహూకరిస్తున్న దాతలు

దామెర : దామేశ్వరాలయ అభివృద్ధికి సహకరించాలని శివం ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలోని శివాలయంలో మంగళవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండకు చెందిన దాతలు గంద్ర విజయమధుసూదన్ రెడ్డి దంపతుల సహకారంతో ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. త్వరలో ఆలయ పరిసర ప్రాంతాల్లో, చెరువు కట్టపై సోలార్ లైట్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఆధ్యాత్మిక, ఆహ్లాద వాతావరణం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్న పేర్కొన్నారు. మొదట విజయమధుసూదన్ రెడ్డి దంపతులు స్వామివారికి అర్చన, అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నాగిళ్ల రాజుశర్మ, అడ్వకేట్ పోల్సాని అనిల్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అధికారులకు సన్మానం



ఎఫ్ఏను సన్మానిస్తున్న ఉపాధి హామీ కూలీలు

శాయంపేట : ఉపాధి హామీలో చేపట్టిన పనులను సామాజిక బృందం ఆయా గ్రామాల్లో తనిఖీ చేసినట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర తెలిపారు. ఈ మేరకు మండలంలోని కొత్తగట్టు సింగారంలో మంగళవారం 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై 15వ సామాజిక బృందం తనిఖీ చేపట్టి, ఉపాధి పనుల రికార్డులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎంపీడీఓతో పాటు అబ్జర్వర్ నిషాంత్, ఏపీఓ అనిత పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఉపాధి కూలీలు, మహిళా సంఘాల సభ్యులు తమకు ఈ సంవత్సరం అత్యధిక పనులు కల్పించినందుకు ఎంపీడీఓ, ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్‌ను శాలువాతో సన్మానించారు. గ్రామసభలో స్థానికులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకంపై ప్రజావేదిక

ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నేడు (బుధవారం) 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఫణిచంద్ర మంగళవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 గ్రామాల్లో 2023, ఏప్రిల్ 1 నుంచి 2024, మార్చి 31 వరకు నిర్వహించిన ఉపాధి హామీ పనులను తనిఖీ చేయన్నునారు. ఉపాధి హామీ పథకంలో రూ.3.97 కోట్ల నిధుల పనులపై సభ్యులు గ్రామాల్లో తనిఖీ నిర్వహించి గ్రామసభలో వెల్లడించి తుది నివేదికను సమర్పించేందుకు ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా వేదిక కార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొనాలని కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



శాయంపేట: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర



సాయం అందజేస్తున్న మహిళా సంఘం సభ్యులు

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మాచర్ల చిన్నరాజు ఇటీవల మృతిచెందాడు. కాగా ఫ్రెండ్స్ ఆటో డ్రైవర్స్ యూనియన్ సభ్యులు మంగళవారం చిన్నరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంఘం నుంచి రూ.35 వేల ఆర్థికసాయం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు కట్ల సాంబరాజు, పిట్టల సుధీర్, సభ్యులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన నడిగొట్టు బుచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిందం రవి, మార్కండేయ, రాజేందర్, కట్టయ్య, బాబు, సాంబయ్య తదితరులు ఉన్నారు.



ఐనవోలు: నగదు అందజేస్తున్న బాధ్యులు

రూ.10వేల సాయం అందజేత

శాయంపేట మండల కేంద్రంలోని సాయిబాబా పొదుపు మహిళా సంఘం సభ్యురాలు వల్పదాసు స్వరూప కుమారుడు ప్రశాంత్(26) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా తోటి సంఘం సభ్యులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. సభ్యులు చిందం నిర్మల, సామల కవిత, బాసాని వనమాల, ధనలక్ష్మి, రజిత, రాధాబాయి, శ్రీజ, రమ ఉన్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయండి



మాట్లాడుతున్న శంకరయ్య

వేలేరు : మండల కేంద్రంలోని పలు వీధుల్లో వీధిలైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి గడ్డమీది శంకరయ్య డిమాండ్ చేశారు. మంగళవారం వేలేరు అంబేడ్కర్ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాత్రి సమయాల్లో వీధుల్లో లైట్లు వెలగక ఇళ్లలో నుంచి బయటకు రావాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని, కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉందని వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గూటం పైడయ్య, కేదారి, సదానందం, రమేశ్, ఫరీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.